క్లుప్తంగా

మంత్రి ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా తీర్మానం



బాల్కొండ: మండలంలోని నాగాపూర్ గ్రామంలో ఆదివాసీ నాయక పోడు, విశ్వ బ్రాహ్మణ, మున్నూరుకాపు సంఘ సభ్యులు శనివారం మంత్రి ప్రశాంత్‌రెడ్డికి అండగా ఉంటామని ఏకగ్రీవ తీర్మానం చేసి సర్పంచ్ పెంటు లింభన్నను అందజేశారు.
రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు



ఆర్మూర్‌టౌన్: బీజేపీ తరపున ఎమ్మెల్యే టికెట్ కోసం కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్, బీజేపీ నాయకురాలు విజయ భారతి దరఖాస్తు చేసుకున్నారు. ఈమేరకు వారు శనివారం దరఖాస్తులను హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అందజేశారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నియామకం



వేల్పూర్/పెర్కిట్(ఆర్మూర్): ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వేల్పూర్ మండలం లక్కోర గ్రామానికి చెందిన నాగం రాజేష్ నియమితులయ్యారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జిల్లా ఇన్‌చార్జి ఎస్ మురళి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో రాజేష్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శనివారం రాజేష్ మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

లోక్ అదాలత్‌లో 1,408 కేసులు పరిష్కారం



బోధన్: పట్టణంలోని కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఐదవ జిల్లా అదనపు న్యాయమూర్తి రవికుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రూబిన ఫాతిమా నేతృత్వంలో 1,408 కేసులు పరిష్కరించినట్లు కోర్టు అధికారులు తెలిపారు.

నేడు డ్రైవింగ్ లైసెన్స్ మేళా ప్రారంభం

బోధన్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఉదయం ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళాను ఎమ్మెల్యే షకీల్ ప్రారంభించనున్నారని బీఆర్‌ఎస్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని 18 నుంచి 30ఏళ్ల వయస్సు ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 25వరకు మేళా కొనసాగుతుందని తెలిపారు. అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కుల సంఘాల భవనాలకు నిధులు మంజూరు



కమ్మర్‌పల్లి: మండలంలోని పలు గ్రామాల్లో వివిధ కుల సంఘాల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈమేరకు శనివారం ఆయా సంఘాల ప్రతినిధులకు నిధుల మంజూరు పత్రాలను మంత్రి ప్రశాంత్‌రెడ్డి అందజేశారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

నిజామాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సుప్రీం కోర్టు ఉత్తర్వులను అనుసరించి సమానపనికి సమాన వేతనం చెల్లించాలని అతిథి అధ్యాపకులు డిమాండ్ చేశారు. నగరంలోని తిలక్‌గార్డెన్‌లో శనివారం వారు సమావేశం నిర్వహించారు. అనంతరం రాష్ట్ర అతిథి అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రంజిత్, జనరల్ సెక్రటరీ మౌనిక, ఉపాధ్యక్షుడు మహేశ్ మాట్లాడారు. తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. నాయకులు సంతోష్, సవిత, గంగాధర్, సురేష్‌రెడ్డి, రామ్‌మోహన్, సంగీత, దిలీప్ పాల్గొన్నారు.

వీధి కుక్కలను నియంత్రించేదెలా?

- పట్టించుకోని అధికారులు
- భయాందోళనలో ప్రజలు



ఆర్మూర్‌లోని పాతబస్టాండ్ సమీపంలో రోడ్డుపై కుక్కల స్వైర విహారం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. మున్సిపల్ పరిధిలోని 36 వార్డులలో ఎక్కడ చూసినా గుంపులుగుంపులుగా కుక్కలు తిరుగుతూ స్థానికులను భయపెడుతున్నాయి. దీంతో ఉదయం పాఠశాలకు వెళ్లే విద్యార్థులు కుక్కలు సమూహంగా తిరుగుతుండడం చూసి భయాందోళన చెందుతున్నారు. రాత్రిపూట వాహనాలపై వెళ్తున్న సమయంలో కుక్కలు వెంబడించి దాడులు చేస్తున్నాయి. ఆర్మూర్‌లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనసంచారం ఎక్కువ ఉన్న చోట కుక్కలు మీద పడి దాడులు చేస్తున్నాయని, అత్యవసర పరిస్థితుల్లో బయటకు రావాలంటే ప్రజలు జంకుతున్నారు.

ఇటీవల వెంకటేశ్వర కాలనీలో ఓ బాలుడు ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో కుక్కలు దాడి చేయడంతో గాయలపాలైయ్యారు. మంథని బ్లాక్‌లో రెండు రోజుల క్రితం ఇద్దరిపై కుక్కలు దాడి చేసిన ఘటనలో వారికి గాయలైయ్యాయి.ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కలు నివారణ చర్యలు చేపట్టాలని పుర ప్రజలు కోరుతున్నారు.

నివారణ చర్యలు తీసుకోవాలి..

ఆర్మూర్ పట్టణంలో రోజురోజుకు కుక్కల సంఖ్య పెరుగుతుంది. దీంతో పట్టణ ప్రజలు భయపడుతున్నారు. చిన్నారులు బయట ఆడుకుంటున్న సమయంలో కుక్కలు దాడులు చేయడంతో గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి నివారణ చర్యలు తీసుకోవాలి.

– రాజు, ఆర్మూర్

కుక్కలను తరలించాలి..

ఆర్మూర్ పట్టణంలోని 36 వార్డులలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. బయటకు రావాలంటేనే భయంగా ఉంది. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కలను ఊరు బయట తరలించాలి.

– మోహన్, ఆర్మూర్

ఘనంగా కాళోజీ జయంతి



పెర్కిట్‌లో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



నందిపేటలో..

పెర్కిట్/నందిపేట్/ఆర్మూర్‌టౌన్: నందిపేట్, ఆర్మూర్ మున్సిపల్ పరిదిలో శనివారం తెలంగాణ వైతాళికుడు కాళోజీ నారాయణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్ లోని సాంఘీక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాలలో కాళీజి జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవం నిర్వహించారు. నందిపేట్‌లో జేఏసీ ఆధ్వర్యంలో, పెర్కిట్‌లోని కాంతి హైస్కూల్‌లో కరస్పాండెంట్ కాంతి గంగారెడ్డి కాళోజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన, ఉపన్యాస, పద్యాల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.

సమ్మెలో పాల్గొనడం లేదు



పెర్కిట్(ఆర్మూర్): అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ఇతర యూనియన్లు చేపడుతున్న సమ్మెలో తాము పాల్గొనడం లేదని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు తార తెలిపారు. ఈమేరకు వారు శనివారం అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, డీడబ్ల్యూవో అధికారిణి రసూల్ బీ, ఆర్మూర్ ప్రాజెక్టు సీడీపీవో భార్గవికి వినతిపత్రం అందజేశారు. టీఎన్‌జీవోస్ నాయకులు శేఖర్, చిట్టి నారాయణరెడ్డి, శ్రీనివాస్, అనురాధ, లక్ష్మి, రాజ్యలక్ష్మి, చిత్ర, గౌతమి, మహాలక్ష్మి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకుందాం



శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ జయరాం

బోధన్‌టౌన్(బోధన్): రానున్న వినాయక చవితి, మిలాద్ ఉన్నబీ పండుగలను ప్రశాంతంగా జరుపుకుందామని అదనపు డీసీపీ జయరాం అన్నారు. పట్టణ శివారులోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో శనివారం ఆయన డివిజన్ స్థాయి శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వినాయక నిమజ్జన శోభాయాత్ర, మిలాద్ ఉన్నబీ ర్యాలీలు ఒకే రోజున ఉన్నాయని దీనికి ఇరు వర్గాల వారు సహకరించాలని కోరారు. అకతాయిలు లేనిపోని పుకార్లు సృష్టిస్తే నమ్మవద్దని సూచించారు. శోభాయాత్ర రూట్లను, మిలాద్ ఉన్నబీ ర్యాలీ రూట్‌లను పోలీసులకు ఆయా కమిటీలు ముందుగా తెలియజేయాలని, దానికి తగ్గట్టు ఏర్పాట్లు చేస్తామని వెల్లడించారు. ఆర్డీవో రాజాగౌడ్, ఇన్‌చార్జి ఏసీపీ రవిందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, తహసీల్దార్ గంగాధర్, సీఐలు ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్, జయేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షాదీఖానా నిర్మాణ పనుల అడ్డగింత



వర్ని: మండలంలోని జాకోర గ్రామంలో షాదీఖానా నిర్మాణ పనులను శనివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామపంచాయతీ కేటాయించిన స్థలంలో కాకుండా మరికొంత స్థలాన్ని ఆక్రమించుకొని నిర్మాణం చేపడుతున్నారని ఆరోపిస్తూ గ్రామస్తులు పనులను అడ్డుకున్నారు. తీర్మానానికి వ్యతిరేకంగా నిర్మాణం చేపడితే పనులు జరగనివ్వమని, నిబంధనల ప్రకారం నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు సూచించారు.

శ్రద్ధానంద్ గంజ్ రైల్వేగేట్‌ను తెరిపించండి



జీఎంతో మాట్లాడుతున్న నాయకులు

నిజామాబాద్ నాగారం: నగరంలోని రైల్వేస్టేషన్ తనిఖీకి వచ్చిన దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌కు రైల్వేగేట్ పరిరక్షణ కమిటీ సభ్యులు శనివారం వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలోని శ్రద్ధానంద్ గంజ్ వద్ద ఉన్న రైల్వేగేట్‌ను ముందస్తు సమాచారం లేకుండా 15 రోజులుగా మూసివేయటంతో అక్కడి ప్రజలు, పాదచారులు, చిన్న వ్యాపారస్తులు, రిక్షాకార్మికులు, ఆటోడ్రైవర్లు, హమాలీలు, కూలీలు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తిరగి రైల్వేగేట్‌ను తెరిపించాలని వారు కోరారు. దీనిపై జీఎం సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సర్వసమాజ్ కమిటీ కోకన్వీనర్ ఆదె ప్రవీణ్ కుమార్, రైల్వే గేట్ పరిరక్షణ కమిటీ సభ్యులు కోనేరు సాయికుమార్, బుస్సాపురం అశోక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఘనంగా మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు



బోధన్/ఎడపల్లి/నవీపేట: బోధన్ నియోజకవర్గంలో శనివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డి మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. సాలూరలో వేడుకల్లో మోహన్‌రెడ్డి హాజరై, కేక్ కట్ చేశారు. అలాగే పలు మండలాల్లో పార్టీ శ్రేణులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ద్వాదశ దినకర్మ



భీమ్‌గల్: బీఆర్‌ఎస్ వ్యవస్థాపక సభ్యుడు, మాజీ జెడ్పీటీసీ కొండ ప్రకాష్ గౌడ్ ఇటీవల మరణించగా.. శనివారం పట్టణంలో ద్వాదశి దినకర్మ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి ప్రశాంత్‌రెడ్డి హాజరై, ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు.



కమ్మర్‌పల్లి: మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను కాంగ్రెస్ నేత సునీల్‌రెడ్డి శనివారం పరామర్శించారు. పలువురికి రూ.5వేల చొప్పన ఆర్థికసాయాన్ని అందించారు. కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బాల్కొండ: మండలంలోని ఇత్వార్‌పేట్‌లో ఇటీవల మృతిచెందిన చిన్నారుల కుటుంబాలను శనివారం జిల్లా ఆదివాసి నాయకులు పరామర్శించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల చిన్నారుల ప్రాణాలు పోయాయయన్నారు. బాధిత కుటుంబానికి రూ.25 వేల ఆర్థికసాయం అందిస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడు రాంచందర్, ప్రధాన కార్యదర్శి గంగాసాయన్న, గంగాధర్, సతీష్, భోజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అక్బర్‌నగర్ చేరుకున్న సెంట్రల్ స్కీం స్టడీ బృందం



రుద్రూర్: మండలంలోని అక్బర్‌నగర్ గ్రామానికి సెంట్రల్ అసిస్టెంట్ సెక్షన్ అధికారుల బృందం శనివారం చేరుకుంది. వీరు నాలుగు రోజుల పాటు గ్రామంలో ఉండి కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలిస్తారు. బృందానికి అన్ని శాఖల సిబ్బంది సహకారించాలరని ఎంపీడీవో బాల గంగాధర్ ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు.

ఆధ్యాత్మికం

■ **ఆలయాల్లో ప్రత్యేక పూజలు**



రుద్రూర్: మండల కేంద్రంలోని పెద్ద హనుమాన్ ఆలయం, లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో అన్నదానాలు ఏర్పాటు చేశారు.

■ **సామూహిక సత్యనారాయణ వ్రతాలు**



నందిపేట్: మండల కేంద్రంలోని కేదారేశ్వర ఆశ్రమంలో శనివారం ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగిరాములు మహారాజ్ ఆధ్వర్యంలో 250 జంటలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

■ **హనుమాన్ చాలీసా కరపత్రాల ఆవిష్కరణ**



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జంబిహనుమాన్ ఆలయ ఆవరణలో శనివారం అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి నిజామాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా కరపత్రాలను ఆవిష్కరించారు. ఆదివారం సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం ఉంటుందని, భక్తులు తరలిరావాలని సభ్యులు తెలిపారు.

■ **శివాలయంలో ఆర్డీవో పూజలు**



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై గల శివాలయంలో శనివారం ఆర్మూర్ ఆర్డీవో వినోద్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి సభ్యులు ఆర్డీవోకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో జరగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కమిటి సభ్యులు సుమన్, పీసీ గంగారెడ్డి, గంగాకిషన్, నక్కల లక్ష్మన్, మల్లయ్య, మీనాచందు పాల్గొన్నారు

■ **ఆధ్యాత్మిక కేంద్రంగా బాన్సువాడ నియోజకవర్గం**



రుద్రూర్: బాన్సువాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమంతోపాటు ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కృషిచేస్తున్నట్లు బాన్సువాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాణంపల్లి గ్రామంలో హనుమాన్ ఆలయ ముఖద్వారా ప్రతిష్టాపనకు శనివారం ఆయన భూమిపూజ నిర్వహించారు. జెడ్పీటీసీ నరోజి గంగారాం, ఎంపీపీ అక్కపల్లి సుజాత నాగేందర్, సర్పంచ్ దయాల రోజా లక్ష్మణ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

■ **తెలంగాణ తిరుపతికి భక్తుల పాదయాత్ర**



రుద్రూర్: పోతంగల్ మండలం హంగర్గా గ్రామంలోని భక్తులు శనివారం లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం నుంచి తెలంగాణ తిరుపతి దర్శనానికి పాదయాత్రగా వెళ్లారు. ప్రతి ఏడాది శ్రావణమాసంలో కాలినడకన దైవ దర్శనం కోసం వెళుతున్నట్లు భక్తులు తెలిపారు.

కుల వృత్తుల వారికి రాష్ట్ర ప్రభుత్వం అండ



బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్న నాయకులు

ఆర్మూర్/మాక్లూర్: ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తుల వారికి అండగా నిలుస్తోందని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లోని ఆయన నివాసంలో శనివారం పలు గ్రామాల్లోని కుల సంఘాల ప్రతినిధులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మాక్లూర్ మండలంని అమ్రాద్ వీడీసీ ప్రతినిధులు, ముదిరాజ్ సంఘ సభ్యులు, కల్లెడలోని పద్మశాలి, చిన్నాపూర్ మైనార్టీ యువకులు, డొంకేశ్వర్ మండలం గంగాసారం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు, ఆర్మూర్ మండలం పిప్రికి చెందిన కుమ్మరి, ఆర్మూర్‌లోని ఎస్ఎస్‌కే సమాజ్ సభ్యులకు ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి





సమ్మె పోస్టర్లను విడుదల చేస్తున్న యూనియన్ ప్రతినిధులు.. మోస్రా మండలంలో..

బోధన్ రూరల్ (బోధన్): రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జంబి శెట్టి శంకర్ గౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యేశాల గంగాధర్ అన్నారు. బోధన్‌లోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శనివారం యూనియన్ ఆధ్వర్యంలో వారు సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లను, ఆయాలను పర్మినెంట్ చేయాలని, అందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. లేదంటే ఈ నెల 11నుంచి అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు నిరవధిక సమ్మె చేపడతారన్నారు. సంఘ ప్రతినిధులు మంగమ్మ, విక్టోరియా రాణి, పద్మ, లావణ్య రేణుక, వత్సల, సుజాత, లక్ష్మి, అనీషా పాల్గొన్నారు.

మోస్రా మండలంలో..

వర్ని: మోస్రా మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం అంగన్‌వాడీల సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్, కార్మిక నాయకుడు మేకల మల్లేష్, సీఐటీయూ మండల కన్వీనర్ కరుణ, టీచర్లు ఎలిజబెత్ రాణి, సుజాత, సురేఖ రాణి, భాగ్యలక్ష్మి, సుమలత, పుష్ప, నర్సుబాయి తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులందరికీ జీవనభృతి ఇవ్వాలి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

బోధన్ రూరల్ (బోధన్): బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులందరికీ, ఎలాంటి ఆంక్షలు లేకుండా జీవన భృతిని ఇవ్వాలని, ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.2016ను, రూ: 4,000లకు పెంచి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో శనివారం బీడీ కార్మికులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి ఈనెల 12న 'చలో నిజామాబాద్' కార్యక్రమానికి పిలుపునిచ్చామని, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు మల్లేష్, సావిత్రి, గోదావరి, లక్ష్మి, భాగ్య, సునంద పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బోధన్/బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఉద్మీర్ గల్లీలోగల కార్తీక లింగేశ్వర ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఆవు దూడ తల పడవేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని వీరశైవ లింగాయత్ సమాజ్ యువజన విభాగం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం వారు ఆర్డీవో ఏవో విఠల్‌కు వినతిపత్రం అందించారు. అలాగే పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆలయాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు శివకుమార్ అప్ప, శివరాజ్ పాటిల్, లచప్ప, శ్రీనివాస్ పాటిల్, మనోహర్, నగేష్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణకు ఉద్యమించాలి



నిజామాబాద్‌నాగారం: దేశంలో కులాలు, మతాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి ఐక్యంగా ఉద్యమించాలని జన విజ్ఞాన వేదిక జాతీయ నాయకులు డాక్టర్ బ్రహ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు నర్రా రామారావు తెలిపారు. జిల్లాకేంద్రంలోని రెడ్‌క్రాస్ సొసైటీ హాల్‌లో శనివారం వేదిక ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగం' పై వివిధ ప్రజా సంఘాల కార్యకర్తలు, ప్రతినిధులతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి మత, కుల తత్వానికి వ్యతిరేకంగా యువత, విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు నర్సింహులు, టివి రావు, రామ్మోహన్‌రావు, శంకరయ్య, స్వరాజ్యలక్ష్మి, రామబ్రహ్మం, వివి ప్రసాదరావు, నాగరాజుగౌడ్, గంగాకిషన్, విజయానందరావు, సుదర్శన్ పాల్గొన్నారు.